
బంజారాహిల్స్ రోడ్ 14లో నిలిచిన వరద నీరు...


అంబేద్కర్ నగర్‌లో వరద బీభత్సం

అకాల వర్షం.. అతలాకుతలం

బంజారాహిల్స్: కుండపోతగా కురిసిన వర్షంతో ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడి వరద నీరు అక్కడే నిలిచిపోవడంతో స్థానికులు నరకాన్ని చూశారు. భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. బురద పేరుకుపోవడంతో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు దుర్గంధం నెలకొంది. ఫిలింనగర్‌లోని 18 బస్తీలు వరదధాటికి విలవిల్లాడాయి. ఖైరతాబాద్ పరిసర ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. సోమాజిగూడలో రహదారులపై బురద పేరుకుపోయింది. శ్రీనగర్ కాలనీ, కృష్ణానగర్, కమలాపురి కాలనీ ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరి స్థానికులు నరకాన్ని చవి చూశారు. చింతల్‌బస్తీ ప్రధాన రహదారి నీట మునిగింది. ఉదయం పనులకు వెళ్లే స్థానికులు, వ్యాపారులు వరద నీటిలోనే ప్రయాణాలు సాగించారు.


జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దారిలో వరద నీటిని తోడుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

పత్తా లేని జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ప్రధాన రహదారులపై నడుముల్లోతు వరకు వరదనీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, వాకర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద నీరు వెళ్లే మార్గాలన్నీ వ్యర్థాలు, రాళ్లు, చెత్తా చెదారంతో నిండిపోవడంతో వరద ప్రవాహం ఎక్కడికక్కడే నిలిచిపోయింది. బంజారాహిల్స్‌లోని సింగాడికుంట, ఉదయ్‌నగర్, అంబేద్కర్‌నగర్, ప్రాంతాలు నీటమునిగాయి. పంజగుట్ట ప్రధాన రహదారి నీటమునిగింది. ఇక్కడ కూడా వరద నీరు వెళ్లే మార్గాలన్నీ వ్యర్థాలతో నిండిపోవడంతో నివాసాలు జలమయమయ్యాయి. జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్ యాక్షన్ టీమ్‌లు అందుబాటులో లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వరద నీటితోనే సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమస్యను పరిష్కరించలేక చేతులెత్తేశారు. రహదారులు, బస్తీలు జలమయమైనా పట్టించుకునే వారు కరువయ్యారు.


కేబీఆర్ పార్కు ఎదుట


కృష్ణానగర్‌లో పేరుకుపోయిన బురద


వినాయకనగర్‌లో కొట్టుకుపోయిన మట్టి రోడ్డు

సబ్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలి

పంజగుట్ట: రాష్ట్రంలో బీసీ సబ్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలని ఓబీసీ జన్ మోర్చా అధ్యక్షులు విజయ్ చందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1979లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ తీసుకువచ్చారని కానీ ఎవరూ దానిని సక్రమంగా అమలు చేయలేదన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ..బీసీ సబ్‌ప్లాన్ ప్రకారం బీసీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. 10 శాతం కూడా లేని ఓసీలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తున్న పాలకులు జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు మాత్రం క్రీమీలేయర్ పేరుతో ఉన్న రిజర్వేషన్లు తీసేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ లకు జరుగుతున్న అన్యాయాలపై బీసీలు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యక్షులు వినయ్ మిత్రా యాదవ్, భూరుగుల ముఖేష్ గౌడ్, ప్రధానకార్యదర్శి అశోక్ గౌడ్, జాయింట్ సెక్రటరీ నీలి వెంకట రాములు, బాల్‌రాజ్, నర్సింహులు, ఉదయ్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్, వినాయకనగర్ బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం చేపట్టిన మట్టి రోడ్డు శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి దెబ్బతింది. తవ్విన రోడ్డంతా కొట్టుకుపోవడంతో ఆ ప్రాంతాన్ని శనివారం స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పరిశీలించారు. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు ఇటీవలనే పూర్తి కాగా రోడ్డు పనులు చేపట్టేందుకు తవ్వకాల చేపట్టారు. మంచినీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. రోడ్డు పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర, వాటర్ వర్క్స్ మేనేజర్ పవన్ తదితరులకు సూచించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రహమత్‌నగర్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్‌కు చెందిన 91 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదింటి యువతుల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కోఆర్డినేటర్ విజయసింహ, విజయకుమార్, సర్దార్,ఏడీ మధు, ఫయాజ్‌ఖాన్, దేవమణి, మోయిజ్, యూసుఫ్,గౌస్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఆయుర్వేద వైద్యంతో మెరుగైన ఫలితాలు

శ్రీనగర్‌కాలనీ: ఆయుర్వేద, హెర్బల్ వైద్యంతో మెరుగైన ఫలితాలు ఉంటాయని ఆయుర్వేద వైద్యురాలు ఆయేషా అన్నారు. శ్రీనగర్‌కాలనీలో శనివారం ఆమె మాట్లాడుతూ రోషాన ఆయుర్వేదిక్ అండ్ బ్యూటీ పేరుతో ఆదివారం అత్తాపూర్‌లో బ్రాంచ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి బలగం హీరోయిన్ కావ్య కళ్యాణ్‌రామ్, నటి సునయన హాజరవుతున్నట్లు తెలిపారు.

నేటితో ముగియనున్న క్రమబద్ధీకరణ గడువు

బంజారాహిల్స్: ప్రభుత్వం స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారి నివాసాలను క్రమబద్ధీకరించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో నెం.58, 59 జారీ చేసింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 30 వరకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు అవగాహన కల్పించారు. దీంతో షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, ఖైరతాబాద్ మండల పరిధిలోని సోమాజిగూడ, ఖైరతాబాద్, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగల్‌రావునగర్, ఎర్రగడ్డ, బోరబండ డివిజన్ల పరిధిలో ప్రజలు తమ నివాసాలను క్రమబద్ధీకరించేందుకు పెద్ద సంఖ్యలో మీసేవా కేంద్రాలకు తరలివస్తున్నారు. ప్రభుత్వం కటాఫ్ డేట్‌ను కూడా పొడిగించడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. అయితే గడువు ఒక్క రోజే ఉండటంతో మీసేవా కేంద్రాల్లో రద్దీ నెలకొంది. బీపీఎల్ కుటుంబాలకు ఉచితంగా జీవో 58 కింద 125 గజాల దాకా క్రమబద్ధీకరిస్తారు. జీవో 59 కింద అర్హత పొందిన వారిని గుర్తించి వారి ఇళ్లను రిజిష్టర్ చేస్తున్నారు. ప్రభుత్వ మార్కెట్ విలువలో పది శాతం చెల్లిస్తే నేరుగా ఆయా ఇళ్లను లబ్ధిదారుల పేరుతో రిజిష్టర్ డీడ్ చేయనున్నారు. 2020 జూన్ 2లోగా దరఖాస్తుదారుల పేరున కరెంటు బిల్లు, వాటర్‌బిల్లు, జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను రసీదు ఉంటేనే జీవో 59 వర్తిస్తుందని షేక్‌పేట తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఇప్పటికే అర్హులకు అవగాహన కలిగించామని వారందరు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


బంజారాహిల్స్ లోని మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న నివాసితులు

విద్యుత్ స్తంభాలను సరిచేయండి

పంజగుట్ట: అకాల వర్షాల నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభాలను వెంటనే సరిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి గాంధీతాతా నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు తాగునీరు లో ప్రెజర్ వస్తుందని, మూడు ఇనుప కరెంటు స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని తొలగించి అదే స్థానంలో సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. పలు ప్రాంతాల్లో మురుగునీరు పొంగుతుందని కొత్త లైన్‌లు వేయించాలని, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. సమస్యలను నోట్ చేసుకుని త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు శివ, అశోక్, షకీల్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


గాంధీ తాతా నగర్‌లో పర్యటిస్తున్న విజయారెడ్డి

ప్రాథమిక హక్కులపై అవగాహన

ఫిలింనగర్: పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రజలకు ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించారు. ఎవరైనా కులం పేరుతో దూషిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని ఎక్కడైనా పిల్లలు పని చేస్తుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రదీప్, సివిల్ సప్లయ్ అధికారి ఆదిత్య, జలమండలి ఏఈ పవన్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆదినారాయణ, స్థానిక నేతలు పీటర్, వేణు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రేషన్ కార్డులు అందించాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలన్నారు. బడుగుల కోసం ఫిలింనగర్‌లో హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు.


మాట్లాడుతున్న షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు

మన్‌కీబాత్ నిర్మాణాత్మక కార్యక్రమం

రహమత్‌నగర్ : ప్రధాని నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్‌కీబాత్ కార్యక్రమం నిర్మాణాత్మకమైనదని, ఈ కార్యక్రమం ఆదివారంతో 100 ఎపిసోడ్‌లు పూర్తి చేసుకోవడం అభినందనీయమని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు డా.వీపరనేని పద్మ అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ తన అభిప్రాయాలను దేశ ప్రజలతో పంచుకునేందుకు మన్‌కీబాత్(మనసులోని మాట) కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.దీనికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఆదివారం నిర్వహించనున్న మన్‌కీబాత్ కార్యక్రమానికి ప్రత్యేకత ఉందని, వంద ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రేడియో, టీవీల ద్వారా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన 100 శాసన సభ నియోజక వర్గాల్లో ప్రత్యేక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే రోజు ప్రధాని రూ.100 నాణేన్ని విడుదల చేస్తారన్నారు. మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు తిలకించాలని ఆమె సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పన

ఖైరతాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు జస్టిస్ బి.సుభాషణ్‌రెడ్డి ఫౌండేషన్ తరపున శనివారం బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. ఖైరతాబాద్ డివిజన్‌లోని బీజేఆర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన కుర్చీలు, బోర్డులు, పిల్లలు ఆడుకునేందుకు బొమ్మలు, తాగునీటి, మరుగుదొడ్లు ఏర్పాటుకు ఫౌండేషన్ తరపున సహాయ సహకారం అందజేస్తామని తెలిపారు.

డిజైన్ డెస్టినేషన్ ది కొలోజియం స్టోర్ ప్రారంభం

బంజారాహిల్స్: భారతదేశంలోనే అతిపెద్ద డిజైన్ డెస్టినేషన్ ది కొలోజియం స్టోర్ నగరంలో ప్రారంభమైంది. ది కొలోజియం సహ వ్యవస్థాపకుడు నీరజ్ హర్కుట్ మాట్లాడుతూ 400 మందికిపైగా ప్రఖ్యాత ఇంటీరియర్ డిజైనర్లు, ఆర్కిటెక్ట్‌లు, హెచ్‌ఎన్‌ఐలు, మీడియా హౌజ్‌లు ఒకే గొడుగు కిందకు వచ్చి ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశాయన్నారు. దేశంలోనే అతి పెద్ద క్యూరేటెడ్ డిజైన్ డెస్టినేషన్‌గా ఇది మారనుందన్నారు. స్టూడియో డిజైన్ ఇంక్‌కు చెందిన కునాల్, కుష్బూ కండేల్‌వాల్ రూపొందించిన ఈ క్యూరేటెడ్ సెంటర్‌లో ఫర్నీచర్, లైటింగ్, కిచెన్లు, వార్డ్‌రోబ్‌లు, హోం డెకార్, సాఫ్ట్ ఫర్నిషింగ్‌లతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్యూరెటెడ్ కలెక్షన్ల మిశ్రమాన్ని అందిస్తాయన్నారు. 120కి పైగా ఫర్నీచర్ బ్రాండ్లు, 80కిపైగా లైటింగ్ బ్రాండ్లు, 200లకు పైగా హోం డెకార్ యాక్ససరీ బ్రాండ్లు, 100కు పైగా సాఫ్ట్ ఫర్నీషింగ్ బ్రాండ్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ఫ్లోర్ ఒక ప్రత్యేకతతో ఆకట్టుకుంటుందన్నారు. విభిన్నశ్రేణి గ్లోబల్ బ్రాండ్లు ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా లగ్జరీ డిజైన్లను ఇష్టపడేవారికి సరికొత్త అనుభవాలు అందుబాటులో ఉంచామన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న నీరజ్ హర్కుట్